
ఆంధ్రజ్యోతి
5 జయశంకర్ భూపాలపల్లి
సోమవారం 1 డిసెంబరు 2025

ఎలక్షన్లు ముగిసే దాకా

నిరంతర నిఘా

- విడతల వారీగా 500 మంది పోలీసు సిబ్బంది
- నేర చరిత్ర కలిగిన వారిపై ప్రత్యేక నిఘా
- 'ఆంధ్రజ్యోతి'తో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



కృష్ణకాలనీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు విడతల్లో జరిగే పంచాయతీ ఎన్నికల్లో పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేస్తున్నామని అంటున్నారు భూపాలపల్లి ఎస్పీ సరిశెట్టి సంకీర్త్. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు. పంచాయతీ ఎన్నికల్లో పోలీసు శాఖ చేపడుతున్న చర్యలను వివరించారు. ఎస్పీ వెల్లడించిన అంశాలు ఆయన మాటల్లోనే..

పంచాయతీ ఎన్నికలు జిల్లాలో మూడు విడతల్లో జరగనున్న దృష్ట్యా పోలీసు శాఖ పటిష్ఠ చర్యలు చేపడుతోంది. భారీ బందోబస్తు, భద్రత నడుమ ఈ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. 480-500 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటారు. ప్రస్తుతం పని చేస్తున్న పీఎస్‌లకు సంబంధం లేని ప్రాంతాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొనేలా ప్రణాళికలు రూపొందించాం. వీరితోపాటు స్ట్రైకింగ్ ఫోర్స్ పెట్రోలింగ్ టీమ్, సర్వేలెన్స్ టీమ్ సైతం నిరంతరాయంగా పని చేస్తాయి. మండలానికి డీఎస్పీలను ఇన్‌చార్జిలుగా నియమించి పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేస్తాం.

మావోయిస్టుల ప్రభావం లేకున్నా...

జిల్లాలో మావోయిస్టుల ప్రభావం లేకున్నా అధికారులందరినీ అప్రమత్తం చేశాం. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా నిరంతరాయంగా తనిఖీలు చేపడుతున్నాం. ఇందులో భాగంగా మూడు ప్రత్యేక బీడీ టీమ్స్ కల్వర్టులను పరిశీలిస్తున్నాయి. మావోయిస్టులు ఏదైనా దుశ్చర్యలకు పాల్పడే ఆలోచన చేసినట్లయితే.. అలాంటి వాటిని కట్టడి చేసేందుకు ప్రత్యేక టీమ్ అప్రమత్తంగా ఉంటుంది. ఇక ఎన్నికలు జరిగే సమస్యాత్మక, అతి సమస్యాత్మక (మిగతా 8వ పేజీలో)

- సమస్యాత్మక ప్రాంతాలపై పోలీసుల నజర్
- ఉమ్మడి జిల్లాలో 698 గ్రామాల గుర్తింపు
- వీటిలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లకు సన్నాహాలు
- పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు
- రౌడీషీటర్లు, ఘర్షణలు సృష్టించేవారికి కౌన్సెలింగ్
- తాత్కాలికంగా లైసెన్సుడ్ తుపాకులు స్వాధీనం
- అదనంగా సీసీ కెమెరాల ఏర్పాటు



పంచాయతీ ఎన్నికలకు పటిష్ఠ భద్రత

గ్రామ పంచాయతీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి

హనుమకొండ, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రంగాలు అన్ని చర్యలు తీసుకుంటున్నాయి. ఎన్నికల క్రమంలో, ముఖ్యంగా పోలింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆరు జిల్లాలు.. హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని సమస్యాత్మక గ్రామాలను గుర్తించారు. వీటిలో సాధారణ ప్రాంతాలకన్నా మిన్నగా భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్టంగా ఏర్పాటు చేస్తున్నారు.

సమస్యాత్మక ప్రాంతాలు 698

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 698 సమస్యాత్మక ప్రాంతాలు ఉన్నట్టు గుర్తించారు. గత లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గుర్తించిన ప్రాంతాలకు అదనంగా మరికొన్నింటిని చేర్చారు. ఈ సమస్యాత్మక ప్రాంతాలు.. హనుమకొండ జిల్లాలో 52, వరంగల్ జిల్లాలో 29, జనగామ జిల్లాలో 103, మహబూబాబాద్ జిల్లాలో 137, ములుగు జిల్లాలో 35, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో 342 ఉన్నాయి. ఇందులో సమస్యాత్మకంతో పాటు అతి సమస్యాత్మక ప్రాంతాలు కూడా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 30 అతి సమస్యాత్మక ప్రాంతాలు ఉన్నాయి. ములుగు జిల్లాలోని వెంకటాపూర్, వాజేడు మండలాల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. గత లోక్‌సభ, అసెంబ్లీతో పాటు 2019 పంచాయతీ ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక ప్రాంతాల్లో ఎలాంటి ఘర్షణలు జరిగాయి? ఎవరి మధ్య జరిగాయి? ఇందుకు కారణాలేమిటీ, ఇందులో రాజకీయంగా, వ్యక్తిగతంగా జరిగిన ఘర్షణలు ఏవీ? ఇందులో పాల్గొన్నవారు ఎవరు? వారి ప్రస్తుత ఉనికి ఏమిటీ? తదితర వివరాలను అధ్యయనం చేసి ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో తీసుకోవలసిన భద్రతా చర్యలపై పోలీసు యంత్రాంగాలు కసరత్తు చేస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో చేయాల్సిన భద్రతా ఏర్పాట్లపై ఉన్నతాధికారులు ఇప్పటికే సమీక్షిస్తున్నారు. ప్రస్తుతం నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. మొదటి విడత పోలింగ్ నాటికి సర్వసన్నద్ధంగా ఉండేలా ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు.

భద్రతా చర్యలు

పోలింగ్ సందర్భంగా సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక భద్రతా చర్యలను తీసుకుంటారు. ఇలాంటి ప్రాంతాలపై పోలీసుల నిఘా ఎక్కువగా ఉంటుంది. అవసరాన్నిబట్టి అదనపు బలగాలను మోహరిస్తారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంటారు. సాధారణ పోలింగ్ (మిగతా 7వ పేజీలో)

నామమాత్రంగానే

నామినేషన్లు

- ములుగు జిల్లాలో మందకొడిగా రెండో విడత ప్రారంభం
- జేడీ మల్లంపల్లి, ములుగు, వెంకటాపూర్‌లో ఎన్నికలు
- తొలి రోజు అంతంత మాత్రమే నామినేషన్లు

ములుగు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నామినేషన్ల రెండో విడత నామినేషన్ల ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. శనివారం అర్ధరాత్రి వరకు మొదటి విడత నామినేషన్ల పర్వం కొనసాగింది. రెండో విడతలో ములుగు, వెంకటాపూర్, జేడీ మల్లంపల్లి మండలాలకు ఆదివారం మొదలైంది. ఈ మూడు మండలాల్లోని 52 జీపీలు, 462 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. మొదటి రోజు జేడీ మల్లంపల్లి మండలంలో 5 సర్పంచ్, 2 వార్డు మెంబర్లకు, ములుగు మండలంలో 4 సర్పంచ్, 13 వార్డు మెంబర్లకు, వెంకటాపూర్ మండలంలో 9 సర్పంచ్, 22 వార్డు మెంబర్లకు నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తంగా రెండో విడత తొలి రోజు సర్పంచ్‌కు 18, వార్డు సభ్యులకు 36 నామినేషన్లు వచ్చాయి.

రెండో విడత తొలి రోజు ఇలా...


పంచాయతీ ఎన్నికలకు రెండో విడత నామినేషన్లు మొదటి రోజు అంతంత మాత్రంగానే దాఖలయ్యాయి. ములుగు మండలంలోని 19 జీపీలు, 172 వార్డులు, జేడీ మల్లంపల్లి మండలంలోని 10 జీపీలు 90 వార్డులు, వెంకటాపూర్ మండలంలోని 23 జీపీలు, 200 వార్డులకు నామిషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. వెంకటాపూర్ మండలంలోని వెంకటాపూర్ జీపీలో సర్పంచ్ స్థానానికి 5, వార్డు స్థానాలకు 9, నర్సాపూర్ జీపీలో సర్పంచ్ స్థానానికి 2, పాలంపేట జీపీలో సర్పంచ్ స్థానానికి 1, వార్డు స్థానాలకు 10, కేశవాపూర్ జీపీ సర్పంచ్ స్థానానికి 1, వార్డు స్థానాలకు 1, లింగాపూర్ జీపీలో సర్పంచ్ స్థానానికి 2 నామినేషన్లు దాఖలయ్యాయి.

జేడీ మల్లంపల్లి మండలంలోని మల్లంపల్లి జీపీలో సర్పంచ్ స్థానానికి 1, శివాతండా జీపీలో సర్పంచ్ స్థానానికి 1, ముద్దునూర్‌తండా జీపీలో సర్పంచ్ స్థానానికి 1, రామచందాపూర్ జీపీలో సర్పంచ్ స్థానానికి 2, వార్డు స్థానానికి 2 నామినేషన్లు అయ్యాయి.

ములుగు మండలంలోని పత్తిపల్లి జీపీలో సర్పంచ్ స్థానానికి 1, వార్డు స్థానాలకు 5, కాశీందేవిపేట జీపీలో సర్పంచ్ స్థానానికి 1, జంగాలపల్లి జీపీలో సర్పంచ్ స్థానానికి 1, మదనపల్లి జీపీలో సర్పంచ్ స్థానానికి 1, వార్డు స్థానాలకు 3, దేవగిరిపట్నంలో వార్డు స్థానాలకు 4, కన్నాయిగూడెం జీపీలో వార్డు స్థానాలకు 1 నామినేషన్లు దాఖలయ్యాయి.

మొదటి విడతలో 1,363 నామినేషన్లు

పంచాయతీ ఎన్నికలకు ములుగు జిల్లాలోని ఏటూరునాగారం, తాడ్వాయి, గోవిందరావుపేట మండలాలకు మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగింది. చివరి వరకు నమోదైన గణాంకాల ప్రకారం.. 294 సర్పంచ్‌లకు, 969 వార్డు మెంబర్ల స్థానాలకు నామినేషన్లు దాఖలయ్యాయి. గోవిందరావుపేట మండలంలో సర్పంచ్ స్థానాలకు 91, వార్డు స్థానాలకు 378, ఏటూరునాగారం మండలంలో సర్పంచ్ స్థానాలకు 84, వార్డు స్థానాలకు 279, తాడ్వాయి మండలంలో సర్పంచ్ స్థానాలకు 119, వార్డు స్థానాలకు 312 నామినేషన్లు దాఖలు అయ్యాయి. మొత్తంగా మొదటి విడతలో 1,363 నామిషన్లు వచ్చాయి.



పంచాయతీ ఎన్నికల నామినేషన్ కౌంటర్ — మొదటి రోజు 30-11-25

మండలం పేరు	మొత్తం సర్పంచ్ స్థానాలు	దాఖలైన నామినేషన్లు	మొత్తం వార్డు సభ్యులు	దాఖలైన నామినేషన్లు
ములుగు	19	04	172	13
జేడీ మల్లంపల్లి	10	05	90	02
వెంకటాపూర్	23	09	200	21

మందకొడిగానే..

- పంచాయతీ రెండో విడత నామినేషన్లు షురూ..
- భూపాలపల్లి జిల్లాలో నామమాత్రంగానే దాఖలు
- ఆదివారం కావడంతో అభ్యర్థుల్లో అనాసక్తి
- నేడు, రేపు జోరందుకొనే అవకాశం



భూపాలపల్లి మండలం నాగారంలో నామినేషన్ల స్వీకరణలో అధికారులు

కృష్ణకాలనీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల రెండో విడత నామినేషన్ ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. తొలి విడతలో గణపురం, మొగుళ్లపల్లి, రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లో ఎన్నికలు జరగనుండగా వాటి నామినేషన్ల పర్వం శనివారం ముగిసింది. రెండో విడతగా భూపాలపల్లి, చిట్యాల, టేకుమట్ల, పలిమెల మండలాలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటి నామినేషన్ల ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. తొలి రోజు కావడం, వారాంతపు సెలవు ఉండటంతో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడానికి అంతగా ఆసక్తి చూపలేదు.

రెండో విడతల తొలిరోజు ఇలా...

రెండో విడత ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తొలి రోజు మందకొడిగానే సాగింది. భూపాలపల్లి మండలంలో 26 సర్పంచ్ స్థానాలు ఉండగా 3 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇదే మండలంలో 216 వార్డు స్థానాలు ఉండగా వార్డు సభ్యుల స్థానాలకు ఒకటి మాత్రమే దాఖలైంది. టేకుమట్ల మండలంలో 25 సర్పంచ్ స్థానాలు ఉండగా 16, వార్డు సభ్యుల స్థానాలు 198 ఉండగా 4, పలిమెల మండలంలో 8 సర్పంచ్ స్థానాలు ఉండగా 3 నామినేషన్లు, 62 వార్డు స్థానాలు ఉండగా 4, చిట్యాల మండలంలో 26 సర్పంచ్ స్థానాలు ఉండగా 20, వార్డు స్థానాలు 218 ఉండగా 18 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

రానున్న రెండు రోజుల్లో..

రెండో విడత నామినేషన్లకు ఇంకా రెండు రోజులు మిగిలి ఉన్నాయి. డిసెంబరు 2తో ఈ పర్వం ముగియనుంది. ఈ రెండు రోజుల్లోనే అధికంగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశాలు ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. మరోవైపు సోమ, మంగళవారాలు మంచి రోజులనే సెంటిమెంట్ ఉండటంతో ఈ రెండు రోజుల్లో నాలుగు మండలాల్లో నామినేషన్లు అధికంగానే వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

పంచాయతీ ఎన్నికల నామినేషన్ కౌంటర్ — మొదటి రోజు 30-11-25

మండలం పేరు	మొత్తం సర్పంచ్ స్థానాలు	దాఖలైన నామినేషన్లు	మొత్తం వార్డు సభ్యులు	దాఖలైన నామినేషన్లు
భూపాలపల్లి	26	03	216	01
టేకుమట్ల	25	16	198	04
పలిమెల	08	03	62	04
చిట్యాల	26	20	218	18

ప్రజావాణి రద్దు

భూపాలపల్లిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ వారం రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లో ఉన్న దృష్ట్యా సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని ఆయన తెలిపారు. పంచాయతీ ఎన్నికలు ముగిసే వరకు ఇది వర్తిస్తుందని పేర్కొన్నారు.

చల్పాకలో

నెత్తుటి మరక

- భారీ ఎన్‌కౌంటర్‌కు ఏడాది
- గత ఏడాది డిసెంబరు 1 ఎదురుకాల్పులు
- ప్రాణాలు కోల్పోయిన ఏడుగురు మావోయిస్టులు

6లో..



ఇంత అధ్వానమా..?

భూపాలపల్లిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. పట్టించుకొనే వారు లేక పారిశుధ్యం అధ్వానంగా మారింది. ముఖ్యంగా పలు వార్డుల్లో మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. మరికొన్ని వార్డుల్లో చెత్తాచెదారం పేరుకొని ఉంటోంది. శుభ్రం చేసేవారు లేక రోగులు, వారికి తోడుగా వచ్చిన బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని అంటున్నారు. పైగా 'వార్డులు బాగానే ఉన్నాయని కదా...' అని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని తెలిపారు. ఒక దశలోనైతే ఇంకాస్త తెగించి 'మీరెవరూ మాకు చెప్పాల్సిన అవసరం లేదు' అని అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారని రోగులు, వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆస్పత్రిలో తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నామని మొదటి, రెండో అంతస్తులో ఉండే రోగులు అంటున్నారు. కలెక్టరేట్ పక్కనే ఉన్నా ఈ ఆస్పత్రిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువైందని విమర్శిస్తున్నారు.





అపరిశుభ్రంగా ఉన్న ప్రధాన ఆస్పత్రి మరుగుదొడ్లు

స్వగ్రామంలో 'సంగ్రామం'

ఎందుకని..

- ఎమ్మెల్యే ఇలాకాలో ఏకగ్రీవానికి ముమ్మర ప్రయత్నం
- సర్పంచ్ స్థానానికి ప్రత్యర్థి ఒకరే..
- పావులు కదుపుతున్న కాంగ్రెస్



గణపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్దారం గ్రామానికి ఒక ప్రత్యేక ఉంది. ఇక్కడ గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా రసవత్తరంగానే ఉంటాయి. ప్రస్తుతం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్వగ్రామం కావడంతో మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

గణపురం మండలంలో మొత్తం 17 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో బుద్దారం ఒకటి. ఈ జీపీలో 12 వార్డులు ఉన్నాయి. 1,430 మంది పురుషులు, 1,532 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మొత్తం 2,962 మంది ఓటర్లు ఉన్నారు. ఈ పంచాయతీలో తొలి విడత ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో సర్పంచ్ స్థానానికి ఇద్దరు మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. తొమ్మిది వార్డుల్లో ఒక్కొక్కరే వేశారు. సర్పంచ్ స్థానానికి కాంగ్రెస్ బలపరుస్తున్న విడిదినేని శ్రీలత నామినేషన్ నామినేషన్ దాఖలు చేయగా ఆమె ప్రత్యర్థిగా బీఆర్ఎస్ బలపరుస్తున్న కొమురాజు అమృత కూడా వేశారు.

సర్పంచ్ స్థానం దక్కించుకోవాలని..

అత్యధికంగా వార్డు సభ్యుల్లో ఒకొక్కటి మాత్రమే నామినేషన్ పడటంతో అవి ఏకగ్రీవమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇదే క్రమంలో సర్పంచ్ స్థానానికి పోటీదారు ఒక్కరే కావడంతో దానిని కూడా ఏకగ్రీవం చేసుకోవడానికి కాంగ్రెస్ నేతలు పావులు కదుపుతున్నట్టు తెలుస్తోంది. ఎలాగైనా ఈ స్థానాన్ని దక్కించుకోవాలనే పట్టుదలతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్వయంగా రంగంలోకి దిగారని సమాచారం. ఇది మండలంలో హాట్ టాపిక్‌గా మారింది. బుద్దారం పంచాయతీ గతంలోనూ కాంగ్రెస్ ఖాతాలోనే ఉండేది. ఈసారి కూడా దీనిని దక్కించుకుంటారా.. ఎమ్మెల్యే చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తాయా? అనేది చర్చనీయాంశంగా మారింది.

భాషా సాహిత్యం కోసం గ్రంథాలయాలను వినియోగించండి

● వల్లంపట్ల సాహిత్య గ్రంథావిష్కరణలో రియాజ్

హనుమకొండ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సాహితీపరంగా, సాంస్కృతిక పరంగా తెలంగాణ రాష్ట్రంలో ఓరుగల్లు స్థానం ప్రత్యేకమైందని, భాషా సాహిత్యానికై నేటి యువత గ్రంథాలయాలను వినియోగిస్తూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి.రియాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండ వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో జరిగిన సాహిత్య సదస్సులో ప్రముఖ కవి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు వల్లంపట్లపై కేయూలో నిర్వహించిన జాతీయ సదస్సు పత్రాలతో కూడిన వల్లంపట్ల సాహిత్యం, సామాజిక చైతన్యం గ్రంథాన్ని రియాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలుగు శాఖ విశ్రాంత ఆచార్యుడు ప్రొఫెసర్ బన్న అయిలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో రియాజ్ మాట్లాడుతూ.. సమాజ ప్రగతికి మూలమైన భాషా సాహిత్య అభివృద్ధి కోసం రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయాలను మంచి గ్రంథాలతో ఉన్నతీకరిస్తున్నామన్నారు. దీనికి కావాల్సిన ప్రణాళికను సిద్ధం చేసి దశల వారిగా అన్ని గ్రంథాలయాల్లో


వల్లంపట్ల సాహిత్యంపై గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

సాహిత్య గ్రంథాలను పాఠకులకు అందుబాటులో ఉంచుతామన్నారు. భాషా సాహిత్యం పట్ల ఉత్సాహం ఉన్నవారంతా వీటిని ఉపయోగించుకొని సమాజ చైతన్యం కోసం విభిన్న ప్రక్రియల్లో సాహిత్య సృజన చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హేతవాద దృక్పథాన్ని అభివృద్ధి పర్చాలనే వారి రచనలను ఆశయాలను సఫలీకృతం చేయాలన్నారు. ప్రముఖ నవలా రచయిత డాక్టర్ అంపశయ్య నవీన్ సదస్సును ప్రారంభిస్తూ.. అమెరికాకు చెందిన నోబుల్ బహుమతి గ్రహీత బాబ్ దిలానే వలే, ప్రజా వాగ్గేయకారుడిగా జీవితకాలం కృషిచేస్తున్న వల్లంపట్ల సాహిత్య అభిరుచి ఇతరులకు మార్గదర్శనంగా ఉందన్నారు. ఆచార్య బన్న అయిలయ్య అధ్యక్షోపన్యాసం చేస్తూ కిందటేడు తన ఆధ్వర్యంలో కేయూలో వల్లంపట్ల సాహిత్యంపై రెండు రోజుల జాతీయ సదస్సు విజయవంతంగా నిర్వహించామన్నారు. ఇందులో తెలుగు భాషా పరిశోధకులు సమర్పించిన వ్యాసాలను గ్రంథంగా తీసుకురావడం అభినందనీయమన్నారు. భవిష్యత్ తరాలకు ఈ గ్రంథం ఉపయుక్తంగా ఉంటుందన్నారు. డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ గ్రంథాన్ని తనదైన శైలిలో సమీక్షించారు. నాగబెల్లి జితేందర్ సామ్రాట్ స్వాగతం పలికిన సదస్సులో ప్రముఖ పర్యావరణవేత్త ఠాకూర్ రతన్‌సింగ్, కాళోజీ ఫౌండేషన్ కార్యదర్శి వీఆర్ విద్యార్థి, గంటా రామిరెడ్డి, ప్రొఫెసర్ పొడిశెట్టి కృష్ణమాచారి, డాక్టర్ పొన్నాల ఉపేందర్ తదితరులు వల్లంపట్ల సాహిత్య కృషిని కొనియాడుతూ మాట్లాడారు. అనేక మంది సాహితీ ప్రియులు, తెలుగు పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

7న వరంగల్ జిల్లా స్థాయి చెస్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7న పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి టోర్నీలో పాల్గొనే బాలబాలికలు 1 జనవరి 2008 తరువాత జన్మించిన వారు ఈ పోటీలకు అర్హులని కన్నా సూచించారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 4 బాలురు, 4 బాలికలను డిసెంబరు మూడో వారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు సెల్ 90595 22986 నెంబరులో సంప్రదించాలని కన్నా కోరారు.

వైబ్రాంట్ టాలెంట్ టెస్టుకు విశేష స్పందన

హనుమకొండ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వైబ్రాంట్ (రాజస్థాన్ కోట) టాలెంట్ టెస్టుకు ఆదివారం విశేష స్పందన వచ్చిందని వైబ్రాంట్ అకాడమీ డైరెక్టర్ సీహెచ్ రాజేందర్‌రెడ్డి అన్నారు. వైబ్రాంట్ సీటు స్కాలర్‌షిప్ టెస్టుకు నిర్వహించిన పరీక్షలకు పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 1,479 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా అందులో 868 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై విజయవంతం చేశారని తెలిపారు. విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ, నీట్ సంబంధించిన విషయాలపై పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అకాడమీ అడ్మిన్ జి. రఘుపతి, అకాడమీ హెడ్ రామకృష్ణ, అకాడమీక్ కో ఆర్డినేటర్ రాము, ఏజీఎంలు జి.రాజు, డి.రాజు, ఎం.నారాయణసింగ్, మార్కెటింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్ పెన్షనర్స్ సభను విజయవంతం చేయాలి

హనుమకొండ చౌరస్తా, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 2న హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించనున్న తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ మహాసభను విజయవంతం చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తూపురాణి సీతారాం పిలుపు నిచ్చారు. ఆదివారం హనుమకొండ చౌరస్తాలోని విద్యానికేతన్ పాఠశాలలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ మహాసభ సన్నాహక సమావేశం కలువల చంద్రమౌళి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సీతారాం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంబేద్కర్ భవన్‌లో జరుగనున్న జిల్లా మహాసభలో పెన్షన్ భద్రత-ప్రభుత్వాల తీరుతెన్నులు, మన కర్తవ్యం గురించి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య పాల్గొని తన సందేశాన్ని అందిస్తారన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణగిరి వీరన్న, సభ్యులు మహేందర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల జనరల్ అబ్జర్వర్‌గా బాల మాయాదేవి

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్ర్యజ్యోతి): రెండో విడత సాధారణ పంచాయతీ ఎన్నికల జిల్లా జనరల్ అబ్జర్వర్‌గా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవిని నియమించారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు ఆమె విధుల్లో ఉంటారు. ఎన్నికల నిబంధనలు ఉ ల్లంఘనకు సంబంధించిన సమాచారాన్ని, సమస్యలను నేరుగా ఆమె దృష్టికి తీసుకెళ్లవచ్చు. మం డ లం, గ్రామాలకు చెందిన వివిధ రాజకీయ పా ర్టీలు, ప్రజలు, ప్రజా సంఘాలు ఎవరైనా మొబైల్ నెంబర్ 8712735548 ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత పాటించడానికి ఈ అవకాశం కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సత్యశారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఫంగస్ బీర్ల కలకలం

● మద్యం ప్రియుల ఆందోళన



బార్ నిర్వాహకులకు ఫంగస్ బీర్లను చూపిస్తున్న కస్టమర్, బీరులో వచ్చిన ఫంగస్

హసన్‌పర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి కూతవేటు దూరంలోని సాయిని వెంటేజ్ బార్ అండ్ రెస్టారెంట్‌లో ఫంగస్ బీర్ల వివాదం కలకలం రేపింది. సీతంపేటకు చెందిన కొంతమంది గురువారం రాత్రి సాయిని వెంటేజ్ బార్‌లో బీర్లు కొనుగోలు చేసి మద్యం సేవిస్తుండగా రెండు బీర్లలో ఫంగస్ రావడంతో మద్యం ప్రియులు ఆందోళనకు దిగారు. బార్ నిర్వాహకులకు మద్యంప్రియులకు తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. అయితే బార్ నిర్వాహకులు మాత్రం తమ తప్పేమి లేదని, కంపెనీ నుంచి కొనుగోలు చేసిన బీర్లేనని, తాము తయారు చేసినవి కాదని చేతులు దులుపుకునే ప్రయత్నం చేయడంతో వివాదం ముదిరింది. దీంతో ఓ మద్యం ప్రియుడు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఫంగస్ బీర్లను పరిశీలించి సమస్య సద్దుమణిగేందుకు కృషి చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎస్సై దేవేందర్‌ను ఫోన్‌లో వివరణ కోరగా కస్టమర్ కన్జూమర్ ఫోరంలో వేసుకోవచ్చని సలహా ఇచ్చారు.

అక్రమ మద్యం పట్టివేత

సంగెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బెల్టు షాపుల్లో మద్యం విక్రయించవద్దని సంగెం ఎస్సై వంశీకృష్ణ చెప్పా రు. ఆదివారం మొండ్రాయి గ్రామంలోని కిరాణ దుకాణంలో అక్ర మంగా మద్యం అమ్ముతున్న విషయాన్ని తెలుసుకొని దాడులు చేసినట్లు సంగెం ఎస్సై తెలిపారు. గ్రామంలోని ఓ కిరాణంలో రూ.7,690 విలువ కలిగిన మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమో దు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు శంకర్, నీవన్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

అండర్-14 క్రికెట్ విజేత హనుమకొండ

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ జిల్లాల అండర్-14 క్రికెట్ పోటీల్లో హనుమకొండ జిల్లా జట్టు విజయకేతనం ఎగరవేసింది. ఆదివారం వంగాలపల్లి క్రికెట్ మైదానంలో నిర్వహించిన వరంగల్ జిల్లా వర్సెస్ హనుమకొండ జిల్లా క్రికెట్ ఫైనల్ పోటీలను వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రికెటర్లను వెలుగులోకి తీసుకురావడానికి ఈ నెల 26న వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు జయశంకర్ భూపాలపల్లి జిల్లాల నుంచి ఆరు జట్లను ఎంపిక లీగ్ కం నాకౌట్ పద్ధతిన పోటీలు ప్రారంభించామన్నారు. ఈ ఆరు జట్లకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా క్రీడామైదానంతో పాటు హనుమకొండ జిల్లా కేంద్రంలోని వంగాలపల్లి క్రికెట్ మైదానాల్లో నాలుగు రోజులుగా పోటీలు నిర్వహించమన్నారు. ఈ మేరకు హనుమకొండ, వరంగల్ జిల్లా జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన ఫైనల్ పోరులో హనుమకొండ జిల్లా జట్టు అంతర్ జిల్లా అండర్-14 విజేతగా నిలిచిందని ఆయన వెల్లడించారు. విజేతగా నిలిచిన హనుమకొండ జిల్లా జట్టులో బౌలింగ్, బ్యాటింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను డిసెంబరు చివరి


అండర్-14 అంతర్ జిల్లాల క్రికెట్ విజేతగా నిలిచిన హనుమకొండ జిల్లా జట్టుతో నిర్వాహకులు

వారంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న అండర్-14 బాలుర క్రికెట్ టోర్నీకి ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తోట రాము, సంయుక్త కార్యదర్శి ఉపేందర్, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి..

చెన్నారావుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చెన్నారావుపేట డిప్యూటీ తహసీల్దార్‌పై హైదరాబాద్‌లోని సీసీఎల్ఏలో గ్రీవెన్స్‌లో తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్‌గెజిటెడ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. కార్యాలయంలో ఉద్యోగులను ఎంచుకొని వారితో నిబంధనలకు విరుద్ధంగా పనులను చేయిస్తోందని ఫిర్యాదు చేశారు. జీపీవోలు చేయాల్సిన పనుల్లో సైతం జోక్యం చేసుకుంటోందని ఫిర్యాదు చేశారు. డిప్యూటీ తహసీల్దార్‌పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవి ఫిర్యాదు చేశారు.

బీరు బాటిల్‌లో చెత్త

● ఆందోళన వ్యక్తం చేసిన యువకుడు.. వర్ధన్నపేట అక్షయ బార్‌లో ఘటన

వర్ధన్నపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని అక్షయ బార్ అండ్ రెస్టారెంట్‌లో బీరు బాటిల్‌లో చెత్త చెదారం వచ్చిన సంఘటన అదివారం చోటు చేసుకుంది. బాధిత యువకుడు తెలిపిన వివరాల ప్రకారం.. అదివారం మధ్యాహ్నం బీరు తాగి సేదతీరుదామని వర్ధన్నపేట పట్టణంలోని అక్షయ బార్‌లో బీరు కొనుగోలు చేసి తాగేందుకు గ్లాస్‌లో పోయగా , అధికంగా చెత్త రావడంతో అవాక్కయిన యువకుడు వీడియో తీసి బార్‌లో వ్యక్తులందరికీ చూపించి ఆందోళన వ్యక్తం చేశాడు. దీంతో బార్ యాజమాని కలుగజేసుకొని యువకుడికి మరోక బీరు బాటిల్ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. ఎక్సైజ్ అధికారులు బార్‌లను తనిఖీలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


బీరుబాటిల్‌లో వచ్చిన చెత్త

రైఫిల్ షూటింగ్‌లో
గోపాల్‌రావుకు గోల్డ్ మెడల్

సంగెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాపులకనపర్తి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి గోపాల్‌రావు రైఫిల్ షూటింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా కేంద్రంలోని ఐటీసీ హోటల్‌లో జరిగిన 50 మీటర్స్ స్మాల్‌బోర్ రైఫిల్ ప్రోన్ ఈవెంట్లలో కాపులకనపర్తి గ్రామానికి చెందిన ఎర్రబెల్లి గోపాల్‌రావు గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎం.మల్లికార్జున్ నాయక్ అవార్డుతో పాటు గోల్డ్‌మెడల్ అందించారు. గోపాల్‌రావు గత కొన్నేళ్ళుగా రైఫిల్ షూటింగ్‌లో రాణిస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు.



WANTED
★ Wanted English & Computer Science, Statistics, Maths, Commerece Arithmetic Faculty to Work for Reputed Institution Cont: 9676481370
AJW-257212

అడ్మిషన్లు ప్రారంభమైనవి
★ Issta Insitute of Management ద్వారా SSC అర్హతతో Pre-Primary Teacher Training Course కొరకు అడ్మిషన్లు జరుగుచున్నవి. వివరాలకు నయీంనగర్, హన్మకొండ : 9059171171, 7382340025.
AJW-18030

WANTED
★ శ్రీ శివశక్తి బయోప్లాంటెక్ కంపెనీలో పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతీ/యువకులు వెంటనే కావలెను. సెల్.నెం: 9866568219/9908443745
AJW-6666

ఆరోగ్య డయాగ్నోస్టిక్స్
★ 3,999/- విలువైన 68 టెస్టులు కేవలం 799/-మాత్రమే మరియు 2,499 విలువైన 5 టెస్ట్ కేవలం 999/- మాత్రమే, నవంబర్ 29,30 తేది ఆదివారం రెండు రోజులు మాత్రమే. రాకెట్స్ స్టేట్, వెహ్రా సెంటర్ దగ్గర దాడేపల్లి గారి హాస్పిటల్ ఎదురుగా, మహబూబాబాద్ సంప్రః 9666006899, 9000424742
AJW-243481

WANTED
★ కాకాజీ కాలనిలో G+2 గల బిల్డింగ్ రెంట్/లీజ్‌కు ఇవ్వబడును. హస్పిటల్స్/బ్యాంక్స్/హోటల్స్ కు అనుకూలం. సం॥ప్ర॥ 8978639811
AJW-257215

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, దట్టి వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

3+2 స్కీం కలదు

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే.
అదనపు లైనుకు రూ. 45/-
గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ
9985400013
8978510273
9985411677
వరంగల్
9949638376
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9949638376
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232

చల్పాకలో నెత్తుటి మరక

● భారీ ఎన్‌కౌంటర్‌కు ఏడాది
● గత ఏడాది డిసెంబరు 1న ఎదురుకాల్పులు
● ప్రాణాలు కోల్పోయిన ఏడుగురు మావోయిస్టులు

గతేడాది ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం


ఏటూరునాగారం రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఏటూరునాగారం దండకారణ్యం ఒకప్పుడు మావోయిస్టుల కంచుకోట. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్న కాలంలో అనేక సంచలనాత్మక సంఘటనలకు కేరాఫ్‌గా ఉండేది. క్రమేణా పరిస్థితులు మారుతూ వస్తున్నాయి. మావోయిస్టుల ప్రాబల్యం రెండు దశాబ్దాలుగా తగ్గుతూ వస్తోంది. అయితే... కొన్నేళ్లుగా స్తబ్దుగా ఉన్న ఏజెన్సీ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గత ఏడాది డిసెంబరు 1న తుపాలకు మోతతో దద్దరిల్లింది. ఏటూరునాగారం మండలం చల్పాక అడవుల్లో పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరగాయి. దీంతో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా అతి పెద్ద ఎన్‌కౌంటర్ జరిగింది ఇక్కడే. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులకు భారీ నష్టం కలిగించింది. మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు, ఇల్లందు, నర్సంపేట ఏరియా కమిటీ కార్యదర్శి కుర్సం మంగు అలియాస్ భద్రు అలియాస్ పాపన్న, ఏటూరునాగారం-మహదేవపూర్ డివిజనల్ కార్యదర్శి ఈగోలాపు మల్లయ్య అలియాస్ మధుతో పాటు ఏరియా కమిటీ సభ్యులు ముస్సాకి దేవాల్, ముస్సోకి జమునా, పార్టీ సభ్యులు జైసింగ్, కిషోర్, కామేష్ మృతి చెందారు. ఇందులో ఓ మహిళ మావోస్టు కూడా ఉన్నారు.

- ఉలిక్కిపడ్డ ఏజెన్సీ..

గత ఏడాది చల్పాకలోని పోలాకమ్మ వాగు సమీపంలో ఉన్న పొట్టిమెద అటవీ ప్రాంతంలో తెల్లవారుజామున కూంబింగ్ చేస్తున్న గ్రేహౌండ్స్ పోలీసులకు మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగి ఏడుగురు మావోస్టులు మృతి చెందడం రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. కొన్నేళ్లుగా స్తబ్దుగా ప్రశాంతంగా ఉన్న ఏజెన్సీలో ఎన్‌కౌంటర్ జరగడంతో ఆ ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఎన్‌కౌంటర్‌తో అటవీ పల్లెల్లో భయాందోళనలు రేకేత్తాయి.

- ఎన్‌కౌంటర్‌పై మండిపడ్డ ప్రజా సంఘాలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే రాష్ట్రంలో భారీ ఎన్‌కౌంటర్ జరిగి ఏడుగురు మావోయిస్టులు మృతి చెందడం ప్రజా


ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు (ఫైల్)

సంఘాలు రేవంత్ సర్కార్‌పై మండిపడ్డాయి. ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని మానవ హక్కుల సంఘాలు ఆరోపించాయి. అన్నంలో విషమిచ్చి స్పృహ కోల్పోయిన మావోయిస్టులను కాల్చి చంపారని ఆగ్రహం వ్యక్తం చేశాయి. కోవర్టు ఆపరేషన్‌తోనే ఏడుగురిని పట్టుకొని కాల్చి చంపారని మావోయిస్టుల కుటుంబసభ్యులు ఆరోపించారు. దీనిపై న్యాయవిచారణ జరిపించాలని ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మల్లయ్య అలియాస్ మధు భార్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. చల్పాక ఎన్‌కౌంటర్‌పై అన్ని వర్గాల నుంచి వ్యతిరేక రావడంతో ప్రభుత్వం మావోయిస్టుల పట్ల కొంత సానుకూలంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామానలతో కొంతమంది మావోయిస్టులు తెలంగాణలోనే తలదాచుకుంటున్నారని నిఘా వర్గాల సమాచారం.

- ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టుల ఉనికి ప్రశ్నార్థకం

కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టుల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. మావోయిస్టులకు కంచుకోటగా ఉన్న ఛత్తీస్‌గఢ్, ఒడిశా లాంటి రాష్ట్రాల్లో ఆపరేషన్ కగార్ మావోయిస్టులను ఉక్కిరిబిక్కిరి చేసింది. గత ఏడాది ఛత్తీస్‌గడ్‌లో భారీ ఎన్‌కౌంటర్లు జరగడం వందల సంఖ్యలో మావోయిస్టు అగ్రనాయకులు మృతి చెందడం ఆ పార్టీ మనుగడ సాధించలేని పరిస్థితులు నెలకొన్నాయి. వరుస ఎన్‌కౌంటర్లల్లో అగ్ర నాయకుల మృతి చెందడం, పలువురు లొంగిపోవడంతో మావోయిస్టు పార్టీకి తీవ్ర నష్టం కలిగింది.

హోంగార్డు విభాగంలో
నిధుల దుర్వినియోగం

వరంగల్ క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ హోంగార్డు విభాగంలో నిధులు దుర్వినియోగం జరిగినట్లు ఇంటెలిజెన్స్ డీజీతో పాటు రాష్ట్ర పోలీస్ అధికారులకు 15 నెలల కిందట సస్పెండ్‌కు గురైన హోంగార్డు మేకల గోపి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు డీజీ ఆదేశాలతో జిల్లా ఇంటెలిజెన్స్ అధికారులు తనను కార్యాలయానికి పిలిపించుకొని వివరాలు తెలుసుకున్నట్లు హోంగార్డు వెల్లడించారు. అదేవిధంగా తనపై హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో తప్పుడు కేసు నమోదు చేసి విధుల్లో నుంచి తొలగించారన్నారు. దీనిపై సీపీకి ఫిర్యాదు చేయగా ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ విచారణ చేసి ఎలాంటి ఆధారాలు దొరకలేదని రిపోర్ట్ ఇచ్చారన్నారు. ఏ తప్పు చేయని తనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని బాధిత హోంగార్డు సీపీ సన్‌ప్రీత్ సింగ్‌ను కోరుతున్నారు.

ఆదివాసీ యువత బరిలో నిలవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర కార్యదర్శి సాయి

వెంకటాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల్లో ఆదివాసీ యువత బరిలో నిలవాలని గోండ్వాన సంక్షేమ పరిషత్(జీఎస్పీ) రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. ములుగు జిల్లా వెంకటాపురం కొమరంభీం కాలనీలో సంఘం సమావేశం లక్ష్మయ్య అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా సాయి హాజరయ్యారు. రాజకీయ పార్టీల మాయమాటలు నమ్మి 70ఏళ్లుగా ఆదివాసీలు మోసపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 1976లో ఓటు బ్యాంకు కోసం లంబాడీలను ఎస్టీ జాబితాలో కలిపి ఆదివాసీలకు తీరని అన్యాయం చేసిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్టీ జాబితాలో ఉన్న తొమ్మిది కులాలను కలుపుతామని చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా స్వతంత్ర అభ్యర్థులుగా సర్పంచ్ ఎన్నికల్లో ఆదివాసీ యువత బరిలో నిలవాలని అన్నారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగిస్తామని రాజకీయపార్టీలు మేనిఫెస్టోలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా కొమరంభీం కాలనీలోని ఆదివాసీల భూ సమస్యను తక్షణమే పరిష్కరించాలని, లేదంటే రాజకీయపార్టీలను బహిష్కరిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు తాటి రాజేష్, గోపి, భీమయ్య, మంగయ్య పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

● భూపాలపల్లి ఎస్పీ సంకీర్త్

చిట్యాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తామని జయశంకర్ భూపాపల్లి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. మండలంలోని చల్లగరిగ, చిట్యాలలో నామినేషన్ క్లస్టర్లను, స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆదివారం సందర్శించారు. అక్కడి స్థితిగతులపై ఎన్నికల సిబ్బంది, స్థానిక పోలీసులను ఆరా తీశారు. మూడు విడతల్లో జరుగనున్న పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గత ఎన్నికల్లో ఘర్షణలు చోటుచేసుకున్న పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఓటర్లు ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికల్లో పాల్గొనాలన్నారు. ఆయన వెంట సీఐ మల్లేష్, ఎస్సై శ్రావణ్‌కుమార్, చిట్యాల మూడవ ఎస్సై ఈశ్వరయ్య ఉన్నారు.

సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల పరిశీలన

టేకుమట్ల (ఆంధ్రజ్యోతి): మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన వెలిశాల, గర్మిళ్లపల్లి పోలింగ్ కేంద్రాలను ఎస్పీ సిరిశెట్టి


చిట్యాలలో ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ సంకీర్త్

సంకీర్త్ పరిశీలించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత, పోలీస్ బందోబస్తు, సిబ్బంది నిర్వహణకు రక్షణ తదితర అంశాలపై స్థానిక పోలీసులకు సూచనలు చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో ముగిసేలా కృషి చేయాలన్నారు. ఆయన వెంట చిట్యాల సీఐ మల్లేష్, టేకుమట్ల ఎస్సై సుధాకర్ ఉన్నారు.

పోలింగ్‌కు పటిష్ఠ భద్రత

(5వ పేజీ తరువాయి)

కేంద్రాల వద్ద ఇద్దరు పోలీసు సిబ్బందిని నియమిస్తే సమస్యాత్మక కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలు, సాయుధ రిజర్వు దళాలు, అవసరమైతే కేంద్ర బలగాలను దించుతారు. అవరసమైతే ఇక్కడ రెండు లేదా మూడు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తారు. పోలింగ్ క్రతువు నిష్పాక్షికంగా జరిగేలా పర్యవేక్షించటానికి సూక్ష్మ పరిశీలకులను నియమిస్తారు. అత్యంత సున్నితమైన కేంద్రాల వద్ద పోలింగ్ సరళిని కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్, రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి ప్రత్యక్షంగా వెబ్ క్యాస్టింగ్ ద్వారా పర్యవేక్షిస్తారు, పోలింగ్ కేంద్రాల్లో జరిగే ప్రక్రియను రికార్డు చేయడానికి సీసీ కెమెరాలు అమర్చుతారు. ఎక్కడ చిన్న అల్లరి జరిగినా నిమిషాల్లో ఘటనాస్థలికి చేరుకోవడానికి క్విక్ రెస్పాన్స్ టీమ్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ నిరంతరం పెట్రోలింగ్ చేస్తాయి. నేరచరితగల వ్యక్తులకు అరెస్టు వారెంట్లు అమలు చేయటం, బైండోవర్ వంటి చర్యలు చేపడతారు. సమస్యాత్మక ప్రాంతాల పరిధిలో లైసెన్సుడ్ రివాల్వర్లు కలిగిన వారి నుంచి ముందు జాగ్రత్తగా పోలింగ్ ముందే వాటిని స్వాధీనం చేసుకుంటారు. గొడవలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రచార సరళిపై నిఘా వేసి ఉంచుతారు. సమస్యాత్మక ప్రాంతాల్లోని రౌడీషీటర్లు, గొడవలు చేసేవారని పోలీసు రికార్డుల్లో ఇది వరకే నమోదైన వారిని ఇప్పటికే వెతికిపట్టి బైండోవర్ చేశారు. రౌడీ షీటర్లకు పోలీసుస్టేషన్లలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతీరోజు పోలీసుస్టేషన్‌కు వచ్చి హాజరు వేసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా గత లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గొడవలు జరిగిన ప్రాంతాలనే ఈ పంచాయతీ ఎన్నికల్లో సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించారు. గత ఎన్నికల్లో గొడవలు చేసిన వారి వివరాలను సేకరించి వారి కదలికలపై నిఘా పెట్టారు. వీరిలో నేరచరిత్ర కలిగిన వారిని ఇప్పటికే బైండోవర్ చేశారు.

సమస్యాత్మకం అంటే..

గత సాధారణ లేదా స్థానిక ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద గొడవలు, ఘర్షణలు, హింసాత్మక ఘటనలు జరిగినా, ఏదైనా కారణంతో రీపోలింగ్ నిర్వహించినా, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయటం వంటి కేసులు నమోదైన ప్రాంతాలను సమస్యాత్మంగా గుర్తిస్తారు. మావోయిస్టుల ప్రభావం ఉన్నా, అంతరాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దులకు సమీపంలోని పోలింగ్‌కేంద్రాల్లోకి బయటి వ్యక్తులు వచ్చే అవకాశమున్నా కూడా వాటిని కూడా సమస్యాత్మకమైన విగా పరిగణిస్తారు. సామాజిక వర్గాలు, రాజకీయ పార్టీల మధ్య తీవ్రమైన విభేధాలు లేదా కక్షలు కలిగిన ప్రాంతాలు, ఆయా మండలాల పరిధిలో ఏఏ గ్రామాల్లో నేరాలు, గొడవలు ఎక్కువగా జరుగుతున్నాయనే పోలీసు రికార్డుల ఆధారంగా సమస్యాత్మక ప్రాంతాలుగా పరిగణిస్తారు. పరిస్థితుల తీవ్రతను బట్టి మూడు కేటగిరీలుగా సమస్యాత్మక కేంద్రాలను ఎంపిక చేస్తారు. మావోయిస్టు సమస్య ఉన్న ప్రాంతాలను అత్యంత సమస్యాత్మక, రాజకీయ పార్టీ మధ్య పోటీ వాతావరణం ఆధారంగా సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తారు.

హెచ్చరికలు జారీ

నిబంధనలకు విరుద్ధంగా వేలం పాటలు నిర్వహించడం, బలవంతంగా ఏకగ్రీవాలు చేసేందుకు పాల్పడితే కేసులు పెడతామని పోలీసు అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు మైకుల ద్వారా ప్రచారం కూడా చేస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారులు సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించి తాజా పరిస్థితిని తెలుసుకుంటున్నారు. అక్కడ చేయాల్సిన భద్రతా ఏర్పాట్లపై మార్గదర్శనం నెరపుతున్నారు. సంబంధిత పోలీసుస్టేషన్ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియలో సహకరించాలని ఓటర్లకు ప్రత్యేంగా విజ్ఞప్తులు చేస్తున్నారు. ప్రస్తుతం నామినేషన్ల ప్రక్రియ ముగిసిన తర్వాత ఎన్నికల ప్రచారం జోరందుకోగానే సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు పోలీసు యంత్రాంగాలు కసరత్తు చేస్తున్నాయి. ప్రచారం సందర్భంగానూ, పోలింగ్‌రోజునా పగలు రాత్రి విజిబుల్ పోలింగ్ నిర్వహించనున్నారు. సిబ్బంది యూనిఫాంతో కనిపించేలా తిరుగుతారు. రాత్రి వేళల్లో వాహనాల తనిఖీలు నిర్వహిస్తారు. సమస్యాత్మక గ్రామాల్లో అప్పుడే చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను నియంత్రిస్తున్నారు. ముమ్మరంగా తనఖీలు చేస్తున్నారు. అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే డయల్ 100, జిల్లా కంట్రోల్ రూమ్‌కి సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

బరిలో రెబల్స్



- నేతల్లో గుబులు
- ఉపసంహరించుకునేలా పావులు
- బుజ్జగింపునకు ప్రయత్నాలు
- ముఖ్యనేతలకు తలనొప్పిగా మారిన వైనం

హనుమకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ఘట్టం శనివారం ముగిసింది. దీంతో సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్ని నామినేషన్లు దాఖలైంది తెలిసిపోయింది. ఆదివారం నామినేషన్ల పరిశీలన జరిగింది. చెల్లిన నామినేషన్లు ఎన్నో స్పష్టమైంది. దీనిని బట్టి సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎంత మంది పోటీలో ఉన్నది తేలింది. సోమవారం విజ్ఞప్తుల స్వీకరణ ఉంది. వాటిని డిసెంబర్ 2న పరిశీలించి, పరిష్కరిస్తారు. డిసెంబర్ 3న ఉపసంహరణలు జరిగిన తర్వాత మొదటి విడత ఎన్నికల్లో ఎంత మంది పోటీ పడుతుంది ముఖ్య చిత్రం తేటతెల్లం అవుతుంది. అయితే ముఖ్య నేతల్లో, ముఖ్యంగా ఆశావహుల్లో టెన్షన్ మొదలైంది. మొదటి విడత ఎన్నికలు జరిగే 69 సర్పంచ్ స్థానాలకు 496 నామినేషన్లు పడ్డాయి. అంటే ఒక్కో స్థానానికి 7 పోటీ పడుతున్నారు. అలాగే 658 వార్డు స్థానాలకు 1747 నామినేషన్లు దాఖలయ్యాయి. ఒక్కో వార్డులో ఇద్దరి నుంచి ముగ్గురు బరిలో ఉన్నారు. ఈ పరిస్థితి ఆశావహులను కలవరపరుస్తున్నది. వీరంతా బరిలో ఉంటే తమ గెలుపు అవకాశాలు ఎక్కడ దెబ్బ తింటాయోనని ఆందోళన చెందుతున్నారు. పైగా వీరిలో ఎక్కువ మంది తిరుగుబాటుదారులే ఉండడంతో మరింత టెన్షన్‌కు గురవుతున్నారు. రెబల్స్ ఉపసంహరించుకునేలా చేయాలని ఆశావహులు అప్పుడే ప్రధాన పార్టీల ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తోంది. అధికార పార్టీ నేతలకు ఇది అగ్ని పరీక్షగా మారింది. తమ పార్టీ మద్దతుదారులు గెలిచేలా వీలైనంత మేరకు ఏకగ్రీవం చేయాలని ప్రయత్నిస్తున్న నేతలకు ఇందుకు భిన్నంగా పెద్ద సంఖ్యలో అభ్యర్థులు బరిలోకి దిగడంతో వారికి మింగుడు పడడటం లేదు. డిసెంబర్ 3న నామినేషన్ల ఉపసంహరణ చివరి తేదీ. ఆలోగా రెబల్స్ ఉపసంహరించుకునేట్లు ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలయ్యాయి. పార్టీ అండతో బరిలో ఉన్న అభ్యర్థులకు మద్దతుగా రెబల్స్ బరిలో నుంచి తప్పుకునేలా పావులు కదుపుతున్నారు. నయానో, బయానో ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఉపసంహరణల గడువు ముగిసిన తర్వాత వారిని బరిలో నుంచి



తప్పించుకునేందుకు వీలుకాదు కనుక మిగిలిన 48 గంటల్లో వారిని తమ దారికి తెచ్చుకునేందుకు మంతనాలను జోరుగా జరుపుతున్నారు. నజరాలను ఆశచూపుతున్నారు. వచ్చే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అవకాశం ఇస్తామని కూడా హామీలు ఇస్తున్నట్టు తెలుస్తోంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకే ఈ రెబల్ బెడద అధికంగా ఉన్నట్టు సమాచారం. ఇది ఈ రెండు పార్టీల నేతలకు తలనొప్పిగా మారింది. ఎవరిని బరిలో ఉంచాలో, ఎవరిని తప్పుకునేలా బుజ్జగించాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఆశావహులు సైతం తిరుగుబాటుల దారులను బుజ్జగించేందుకు తమ వంతు ప్రయత్నాలను సాగిస్తున్నారు. ఉపసంహరణల తర్వాత మొదటి విడత ఎన్నికల ముఖచిత్రం స్పష్టం కానున్న నేపథ్యంలో ఎన్నికల రాజకీయం అంతకంతకు వేడెక్కుతున్నది. అత్యధిక స్థానాలు దక్కించుకోవాలనే వ్యూహరచనలో ఉన్న ప్రధాన రాజకీయ పార్టీలు సమర్థులు, అంగబలం, అర్థబలం ఉన్న అభ్యర్థులకే పూర్తి మద్దతు ఇచ్చేస్తున్నాయి. స్థానిక పరిస్థితుల నేపథ్యంలో జరిగే పంచాయతీ ఎన్నికల్లో ఏ చిన్న అంశాన్ని వదలకుండా అన్నిటిని నేతలు నిశితంగా గమనిస్తున్నారు. రెబల్ నామినేషన్లు వేసిన గ్రామాల్లో జాగ్రత్తగా అభ్యర్థులను బలపరిచే క్రమంలో ప్రత్యర్థి పార్టీ సపోర్టు ఉన్న అభ్యర్థి బలాబలాలు ఏమిటీ ? ఆర్థిక బలం, ప్రజాబలం ఏ మేరకు ఉంది ? అందుకు దీటుగా ఎవరిని బరిలో కొనసాగిస్తే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉంటాయనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. మొదటి విడత ఎన్నికలు జరిగే గ్రామ పంచాయతీల్లో ముఖాముఖి, ముక్కోణం, బహుముఖ పోటీల్లో ఏదీ ఉంటుందో నామినేషన్ల ఉపసంహరణ తర్వాత స్పష్టమవుతుంది. అయితే ప్రస్తుత పరిస్థితిని బట్టి చూస్తే చాలా గ్రామాల్లో త్రిముఖ పోటీ తప్పకపోదని భావిస్తున్నారు.

4 పర్యాయాలు రేబల్లె ఏకగ్రీవం

ఎంసీపీఐ(యూ) పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఏడు సార్లు గెలుపు

దుగ్గొండి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేబల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో నాలుగు పర్యాయాలు ఏకగ్రీవంగా, ఏడు దఫాలుగా ఎంసీపీఐ(యూ) పార్టీ బలపరిచిన అభ్యర్థులు సర్పంచ్‌లుగా గెలిచారు. మండలంలోని రేబల్లె గ్రామ పంచాయతీ 1981లో ఏర్పడింది. జనాభా 1500, ఉండగా ఓటర్లు 999 మంది ఉన్నారు. 8 వార్డులు ఉన్నాయి. 1981లో గ్రామ పంచాయతీ ఏర్పాడిన మొదటిసారిగా ఉమ్మడి సీపీఎం బలపరిచిన కాసుల వీరభద్రయ్య సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. 1990లో ఎంసీపీఐ(యూ) బలపరిచిన అభ్యర్థి గటిక వీరస్వామి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గటిక వీరస్వామి గెలిచిన ఏడాదికే నక్సల్స్‌తో హత్య చేయబడ్డాడు. 1991లో ఎంసీపీఐ (యూ) బలపరిచిన అభ్యర్థి సిరిబొమ్మల పెద్ద కొంరయ్య, ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. 1995లో ఎంపీసీపీ(యూ) బలపరిచిన అభ్యర్థి కుసుంబ లక్ష్మి సర్పంచ్‌గా గెలుపొందారు. 2001లో ఎంసీపీఐ(యూ) బలపరిచిన మహ్మద్ హుస్సేన్ ఏకగ్రీవంగా గెలిచారు. 2007లో జరిగిన ఎన్నికల్లో ఎంసీపీఐ(యూ) బలపరిచిన గీసుపాక కొంరయ్య గెలిచారు. 2014లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి మెరుగు రాంబాబు సర్పంచ్‌గా గెలుపొందారు. 2019 జరిగిన ఎన్నికల్లో ఎంసీపీఐ(యూ) బలపరిచిన అభ్యర్థి గటిక మమత సర్పంచ్‌గా గెలిచారు. గ్రామ పంచాయతీ గత నాలుగు దఫాలుగా జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో గెలుచుకోవడంతో పాటు ఒకే పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలుచుకొని ప్రత్యేకతను సాధించుకున్నట్లు గ్రామస్థులు వెల్లడించారు. ఈసారి జరిగే ఎన్నికల్లో ఏ పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలుచుకుంటారోనని పలువురు ముచ్చటించుకుంటున్నారు.

మాజీ సర్పంచుల బకాయిలు ఎన్ని?

- వివరాలు సేకరించిన ప్రభుత్వం
- కార్యదర్శుల బకాయిలపై ఆరా

హనుమకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచులు తమ హయాంలో గ్రామ పంచాయతీల్లో వివిధ అభివృద్ధి పనుల కోసం తమ సొంత నిధులు ఏ మేరకు ఖర్చు పెట్టింది? మొత్తంగా బకాయిలు ఎన్ని ఉన్నాయనే అంశంపై రాష్ట్రప్రభుత్వం దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ జారీ కావడానికి కొద్ది రోజుల ముందు మాజీ సర్పంచుల బకాయిల వివరాలను పంపాలని జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారులను కోరింది. పంచాయతీల వారీగా ఇప్పటి వరకు చేసిన పనులకు సంబంధించి చెల్లించాల్సిన బకాయిలు ఎంత మేరకు ఉన్నాయో చెప్పాలంటూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అధికారులు ఎంపీడీవోల ద్వారా పంచాయతీల వారీగా బకాయిల వివరాలను తెప్పించుకున్నట్టు తెలిసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తంగా రూ.79.68కోట్ల వరకు ఉన్నట్టు అంచనా. ఒక హనుమకొండ జిల్లాలోనే రూ.15.20 కోట్లు ఉన్నట్టు సమాచారం. 2024 జనవరి, ఫిబ్రవరితో పంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసింది. అనంతరం ప్రత్యేకాధికాలరుల పాలన కొనసాగుతోంది.

కార్యదర్శుల బకాయిలు కూడా..

ప్రత్యేకాధికారుల పాలనలో కార్యదర్శులు పంచాయతీల్లో వివిధ పనులపై తమ జేబు నుంచి చేసిన ఖర్చుల వివరాలను కూడా ప్రభుత్వం అడిగినట్టు తెలుస్తోంది. పంచాయతీల్లో తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్యం, వరద ముంపు చర్యలతో పాటు అనేక రకాల పనులకు పంచాయతీ కార్యదర్శులు తమ సొంత నిధులను వెచ్చిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో వీరి బకాయిలు కూడా రూ.20కోట్ల వరకు ఉండవచ్చునని అంచనా. దీనితో మాజీ సర్పంచులు, కార్యదర్శుల బకాయిలు మొత్తంగా కలిపి రూ.99.68 కోట్ల వరకు ఉండవచ్చునని తెలుస్తోంది. సుమారు 20 నెలలకుపైగా పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్రం నుంచి వచ్చే రూ. వందల కోట్ల నిధులు వెనక్కు వెళ్లకుండా డిసెంబరు లోపు ఎన్నికలు నిర్వహించి వాటిని పంచాయతీలకు మళ్లించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. అయితే ఈ బకాయిలను ఎప్పుడు చెల్లించేది స్పష్టత లేదు. పంచాయతీ ఎన్నికల తర్వాత విడుదల చేయవచ్చునని భావిస్తున్నారు.

రెండు గ్రామాల్లో ఏకగ్రీవం

ఉమ్మడి జిల్లా శాంతి నగర్, చంద్రుతండాలో సర్పంచ్‌ల ఎన్నిక



వెలంగిణి మేరీ

ఎల్కతుర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రెండు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఎల్కతుర్తి మండలం శాంతినగర్ గ్రామ పంచాయతీ ఏకగ్రీవమైంది. గత సర్పంచ్ వెలంగిణి మేరిని గ్రామస్థులు రెండోసారి సైతం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో పాటు గ్రామంలో ఉన్న నాలుగు వార్డులను సైతం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 187 మంది ఓటర్లు ఉన్న శాంతినగర్‌లో 86 మంది మహిళలు, 101 మంది పురుషుల ఉన్నారు. గతంలో మాదిరిగా జనరల్ మహిళగా రిజర్వేషన్ అనుకూలించడంతో ఆమెకే రెండోసారి అవకాశం దక్కింది. కోతులనడుమ గ్రామానికి అనుబంధ గ్రామంగా ఉన్న శాంతినగర్ గత ప్రభుత్వం ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసింది, మొదటిసారిగా జనరల్ మహిళ కావడంతో మేరీని మొదటి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే తిరిగి రిజర్వేషన్ అనుకూలించడంతో ఆమెనే రెండోసారి సైతం ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో పాటు వార్డులనూ ఏకగ్రీవం చేశారు. వరుసగా రెండుసార్లు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం.

గుంటూర్‌పల్లి ఏకగ్రీవం?

గుంటూర్‌పల్లి పంచాయతీ పాలక వర్గం సైతం ఏకగ్రీవం కానుంది?. గ్రామంలో 6 వార్డుల్లో 386 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 196 మంది పురుషులు, 193 మంది మహిళలు ఉన్నారు. ఆరు వార్డులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా, సర్పంచ్ కోసం నెట్టెం నారాయణ, శ్రీరాంచౌదరి సుదిరెడ్డిలు ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. గ్రామ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని శ్రీరాంచౌదరి సుధీరెడ్డిని సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి నెట్టెం నారాయణను విత్‌డ్రా చేయించడానికి ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తోంది. నామినేషన్ల ఉపసంహరణ రోజున ఏకగ్రీవంగా ప్రకటించుకోనున్నట్లు తెలిసింది.

తొలి ఎన్నికల్లోనే చంద్రుతండా ఏకగ్రీవం..!



బానోత్ శ్రీను

కేసముద్రం : కేసముద్రం మండలం వెంకటగిరి శివారు నూతనంగా ఏర్పాటైన చంద్రుతండా గ్రామపంచాయతీ తొలి ఎన్నికల్లోనే ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది. మండలంలోనే అత్యల్పంగా 370 మంది ఓటర్లతో కూడిన ఈ గ్రామంలో తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుడైన బానోత్ శ్రీను ఒక్కరే చివరి రోజైన శనివారం నామినేషన్ వేశారు. మిగిలిన ఎనిమిది వార్డులకు ఒకటి చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక్కడ ఉపసర్పంచ్ స్థానాన్ని బీఆర్ఎస్ మద్దతుదారునికి, ఇరుపార్టీలు నాలుగు చొప్పున వార్డులను పంచుకుని ఆ మేరకు నామినేషన్లు వేసినట్లు తెలిసింది. నామినేషన్ల పరిశీలనలు, ఉపసంహరణల అనంతరం డిసెంబరు 3న వీరిని అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

ప్రతీ 'రోజు'కు ఓ లెక్కుంది..

- ఒకటో రోజు నామినేషన్ ప్రారంభం, 15వ రోజు ఎన్నికలు
- ఏడు రోజులు స్టేజ్-1 రిటర్నింగ్ ఆఫీసర్, ఆపై స్టేజ్-2 ఆర్వోలదే బాధ్యత



కేసముద్రం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రతీరోజుకు ఓ లెక్క ఉంటుంది. నామినేషన్ల ప్రారంభం నుంచి ఎన్నికల వరకు తేదీల వారీగా షెడ్యూల్‌ను ఎన్నికల అధికారులు సాధారణంగా విడుదల చేస్తారు. అయితే ఎన్నికల నిర్వహణలో తేదీలతో పాటు 'రోజు' వారీగా వ్యవహారాలు పరిగణలోకి తీసుకుంటారు. మూడు దశల్లో నిర్వహించే పంచాయతీ ఎన్నికల్లో తేదీలు వేర్వేరుగా ఉన్నప్పటికీ రోజువారీగా జరిగే ప్రక్రియ అంతా ఒకే విధంగా ఉంటుంది.

ఇందులో మొదటి ఏడు రోజులు 'స్టేజ్-1'గాను, ఆ తర్వాత ఎనిమిదో రోజు నుంచి ఎన్నికల రోజు వరకు 'స్టేజ్-2'గాను పరిగణిస్తారు. మొదటి (డే1)రోజు నామినేషన్ ప్రారంభమైతే ఆ రోజు నుంచి సరిగ్గా 15వ రోజున ఎన్నికలు నిర్వహిస్తారు. స్టేజ్-1లో రిటర్నింగ్ అధికారి (ఆర్వో-1) మొదటి మూడు రోజులు నామినేషన్లను స్వీకరించడం, నాలుగో రోజున సాయంత్రం 5 గంటల లోపు వరకు నామినేషన్ల పరిశీలన, ఐదో రోజున సాయంత్రం 5 గంటల లోపు వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఆరో రోజున సాయంత్రం 5 గంటల లోపు అభ్యంతరాలపై సంక్షిప్త దర్యాప్తు జరిపి పరిష్కరిస్తారు. ఏడో రోజున మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను ఉపసంహరించుకుంటారు. ఒక్క నామినేషన్ ఉంటే అదే రోజున ఏకగ్రీవంగా ప్రకటించి గెలిచినట్లుగా ధ్రువీకరణపత్రాన్ని జారీ చేస్తారు. ఆ తర్వాత మిగిలిన అభ్యర్థులతో జాబితాను రూపొందించి, వారికి గుర్తులు కేటాయిస్తారు. ఇక్కడితో స్టేజ్-1 రిటర్నింగ్ అధికారి విధులు పూర్తవుతాయి.

కీలకమైన ఎన్నికల నిర్వహణ బాధ్యత ఆర్వో-2దే..

స్థానిక సంస్థల ఎన్నికల్లో షెడ్యూల్‌లో మొదటి ఏడు రోజుల వరకు రిటర్నింగ్ అధికారి-1 విధులు పూర్తికాగా ఆ తదుపరి స్టేజ్-2లో ఎనిమిదో రోజు నుంచి 15వ రోజు ఎన్నికలయ్యేంత వరకు ఆర్వో-2 బాధ్యతలను నిర్వహిస్తారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేందుకు రెండు భాగాలుగా విభజించి, ఇలా ఇద్దరు వేర్వేరు రిటర్నింగ్ అధికారులను ఏర్పాటు చేశారు. రిటర్నింగ్ అధికారి-2 ఎనిమిదో రోజున అభ్యర్థుల తుదిజాబితా తీసుకొని పోలింగ్ స్థానాలు, బూత్‌ల ఏర్పాటు, మెటీరియల్, సిబ్బంది కేటాయింపుల జాబితాను సిద్ధం చేస్తారు. తొమ్మిదోరోజున జిల్లా ఎన్నికల అధికారి ద్వారా ప్రిసైడింగ్, పోలింగ్ అధికారుల నియామకం, బీఎల్వో, వలంటీర్ల ఎంపిక, బూత్‌ల ఏర్పాట్లు, పదో రోజున పోలింగ్‌స్టేషన్‌లో మౌళిక సదుపాయాలు, మార్కింగ్‌లు ఏర్పాటు చేయడం, 11వ రోజున బ్యాలెట్ పేపర్లు, పెట్టెలు, ఇతర పోలింగ్ సామగ్రిని బూత్ వారీగా సిద్ధం చేసుకుంటారు. 12వ రోజున పోలింగ్ సిబ్బందికి తుది శిక్షణ, 13వ రోజున పోస్టల్ బ్యాలెట్లను స్వీకరిస్తారు. 14వ రోజున ఉదయం ఎన్నికల సిబ్బందికి సామగ్రిని అందజేసి, సాయంత్రం వరకు పోలింగ్ బూత్‌లకు తరలిస్తారు. 15వ రోజున ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన, గెలిచిన వారికి ధ్రువీకరణపత్రాలు ఇవ్వడం, వెంటనే ఉపసర్పంచ్ ఎన్నికల నిర్వహణ, అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల సామగ్రిని అప్పగించడంతో ప్రక్రియ పూర్తవుతుంది.

ఓట్ల కోసం నోట్లు పట్టుకు రావద్దు

మడిపల్లిలో స్ఫూర్తిదాయక ఫ్లెక్సీ

హసన్‌పర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడిపల్లి గ్రామంలో గ్రామస్తులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న ఫ్లెక్సీ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. "నేను మడిపల్లి గ్రామవాసిని, నోట్లకు అమ్ముడు పోయే ఓట్లు మా ఇంట్లో లేవు.. ఓట్ల కోసం నోట్లు పట్టుకొని మా ఇంట్లోకి రాకండి.. తస్మాత్ జాగ్రత్త" అని మడిపల్లికి చెందిన కాందారి రమేష్ తన ఇంటి ముందు ఓ ఫ్లెక్సీని ఏర్పాటు చేయడం గ్రామస్తులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఇప్పుడు ఈ ఫ్లెక్సీ జిల్లా వ్యాప్తంగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రస్తుతం గ్రామ పంచాయతీ ఎన్నికలలో ఊరి బాగు కోసం, అభివృద్ధి కోసం ఆరాటపడే వ్యక్తిని మాత్రమే సర్పంచ్‌గా గెలిపించుకోవాలని, అందుకోసం ఈ ఫ్లెక్సీని ఏర్పాటు చేసినట్లు కాందారి రమేష్ కుటుంబ సభ్యులు చెబుతున్నారు.



మడిపల్లిలో కాందారి రమేష్ ఇంటి ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ←

వణికిస్తున్న హెచ్ఐవీ



- రోజురోజుకూ పెరుగుతున్న కేసులు
- ప్రతీ సంవత్సరం మొక్కుబడిగా కార్యక్రమాలు
- నేడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

పోచమ్మమైదాన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలో రోజురోజుకూ ఎయిడ్స్ వ్యాధి చాపకింద నీరులా వ్యాపిస్తోంది. ఆరోగ్య సంస్థ హెచ్ఐవీపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ కేసులు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి. ప్రాణాంతక ఎయిడ్స్ మహమ్మారి రాకుండా మందులు కనిపెట్టడంలో ఎన్ని పరిశోధనలు జరిగినా ఫలితాలు మాత్రం ఉండడం లేదు. దీంతో ఎయిడ్స్ నివారణ ఒక్కటే మార్గంగా అనునిత్యం అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఏటా డిసెంబరు 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంగా నిర్వహిస్తూ ప్రాణాంతక వైరస్‌పై అవగాహన కల్పిస్తున్నారు. వరంగల్ జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ రోగుల సంఖ్య రోజు రోజుకూ గణనీయంగా పెరుగుతూ వస్తోంది. ఎయిడ్స్ కంట్రోల్ శాఖ నామమాత్రంగా వ్యవహరిస్తుండడంతో ఏటా రోగుల సంఖ్య పెరుగుతోంది.

వరంగల్ జిల్లాలో 5,464 మంది హెచ్ఐవీ బాధితులు

వరంగల్ జిల్లాలో ఇప్పటివరకు 5,464 మంది హెచ్ఐవీ బాధితులు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. జిల్లాలో 2001 నుంచి హెచ్ఐవీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 5,464 మంది హెచ్ఐవీ బాధితులు ఉండగా, వీరిలో 4,558 మందికి ప్రతీ నెల ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. 863 మంది బాధితులకు ఏఆర్టీ ద్వారా ప్రతీనెల రూ.2,016 పెన్షన్ అందిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ప్రతీ నెల కొత్తగా సుమారు 36 హెచ్ఐవీ కేసులు నమోదవుతున్నట్లు రిపోర్టులు చెబుతున్నాయి. కొత్తగా నమోదవుతున్న కేసులలో గర్భిణులు ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

జిల్లాలో హై రిస్క్ కలిగిన వ్యక్తులు సుమారు 3,498 మంది ఉన్నారు. ఇందులో ఫిమేల్ సెక్స్ వర్కర్లు 2,269 మంది, స్వలింగ సంపర్కులు 1,112 మంది, ట్రాన్స్ జెండర్లు 117 మంది ఉన్నారు. ఈ గణంకాలు జిల్లా వాసులను వణుకు పుట్టిస్తున్నాయి.

నిద్ర మత్తులో ఎయిడ్స్ విభాగం

జిల్లాలో ఎయిడ్స్, హెచ్ఐవీ రోగుల సంఖ్య రోజురోజుకూ విపరీతంగా పెరుగుతోంది. అధికారులు మాత్రం తాత్కాలిక నామమాత్రపు లెక్కలతోనే సరిపుచ్చుతున్నారు. ప్రతీ నెల హెచ్ఐవీ కేసుల సంఖ్య పెరుగుతున్నా ఎయిడ్స్ విభాగం మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోంది. నామమాత్రపు ప్రచారంతో సరిపెడుతున్నారని విమర్శలు వెలువడుతున్నాయి. కండోమ్ ప్రమోషన్ జాడే కనిపించకుండా పోయిందని, శిక్షణ కార్యక్రమాలు కూడా గాలికి వదిలేశారని ఆరోపణలు వెలువడుతున్నాయి.

ముందు స్థానంలో వరంగల్ జిల్లా

ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో వరంగల్, హనుమకొండ జిల్లాలు ముందు స్థానంలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే మందులే కాక ప్రైవేటు ఫార్మా కంపెనీల ద్వారా జిల్లాలో ప్రతీ నెల రూ. లక్షలలో మందుల కొనుగోలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అధికారుల పర్యవేక్షణ క్షేత్రస్థాయిలో లేకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

ఎయిడ్స్ నివారణకు కృషి



జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణకు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నాం. ఎయిడ్స్, హెచ్ఐవీ బారిన పడిన రోగులు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలి. 2024-25 సంవత్సరంలో 59,913 మందికి హెచ్ఐవీ రక్తపరీక్ష చేయగా 421మందికి హెచ్ఐవీ ఉన్నట్లు నిర్ధారించాం. గర్భిణులు 25,556 మందికి రక్త పరీక్ష నిర్వహించగా 9 మందికి ఉన్నట్లు నిర్ధారణ జరిగింది. జిల్లాలో మూడు ఐసీటీసీ కేంద్రాలు, 26 ఎఫ్ఐ-ఐసీటీసీ కేంద్రాలు, 1 ఏఆర్టీ కేంద్రం, 2 ఏఆర్టీ లింక్ కేంద్రాలు, విహాన్ కేర్ అండ్ సపోర్ట్ కేంద్రం-1, మూడు రక్తనిధి కేంద్రాల ద్వారా సేవలు కొనసాగుతున్నాయి.

- డాక్టర్ సాంబశివరావు, వరంగల్ డీఎంహెచ్‌వో

ప్రజావాణి రద్దు

ములుగు కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ టి.ఎస్.దివాకర ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరగదని, ఈవిషయాన్ని జిల్లాలోని ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ముమ్మరంగా పోలీసు తనిఖీలు

ఏటూరునాగారం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల అగ్రనేత మాడ్వి హిడ్మా ఎన్‌కౌంటర్‌కు నిరసనగా ఆ పార్టీ కేంద్ర కమిటీ తలపెట్టిన బంద్ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు.ఏజెన్సీ ప్రాంతంలో ముమ్మరంగా సోదాలు నిర్వహిస్తున్నారు. బంద్ సందర్భంగా మావోయిస్టులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. ఏటూరునాగారం సబ్ డివిజన్ పరిధిలోని వాజేడు, వెంకటాపురం, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, తాడ్వాయి మండలాలతో పాటు దట్టమైన అటవీ ప్రాంతాలు, అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పోలీసులు ఆదివారం ముమ్మరంగా తనిఖీలను చేపట్టారు. 163వ జాతీయ రహదారి వెంట పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణలోకి ప్రవేశించే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. వాహనాలు ఆపి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులను, వాహనాలను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. అలాగే అటవీ ప్రాంతాల్లో స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్, గ్రేహౌండ్స్ బంగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. భద్రతా దళాల ఈ అప్రమత్తతతో ఏజెన్సీ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది


ఏటూరునాగారంలో వై-జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం ఎన్నిక


ఆర్యవైశ్య వెంకటాపురం మండల నూతన కమిటీ సభ్యులు

వెంకటాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు సిద్ధంశెట్టి శ్రీనివాస్, అధ్యక్షుడు సిద్ధంశెట్టి లక్ష్మణ్‌రావు, కార్యదర్శి అనంతుల కృష్ణమూర్తి సమక్షంలో కార్యవర్గాన్ని ఖరారు చేశారు. మండల అధ్యక్షుడిగా వేల్పూరి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మదుగూరి శ్రీనివాస్, కోశాధికారిగా ఎల్లంకి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా బచ్చు రవిచందర్, కార్యదర్శులుగా తాటిపల్లి రాజన్న, మాడాల సంతోష్, అనంతుల సంతోష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సంకా హేమసుందర్, ప్రచార కార్యదర్శిగా సోమా చంద్రశేఖర్, మహిళా కమిటీ అధ్యక్షురాలిగా బచ్చు జ్యోత్స్న, కార్యదర్శిగా మదుగూరి సుమలత, కోశాధికారిగా కోట విజయలక్ష్మిలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు కలకోట సంతోష్, బచ్చు పూర్ణచందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వాజేడు మండల కమిటీ..

వాజేడు (ఆంధ్రజ్యోతి): మండల ఆర్యవైశ్య సంఘం మండల కమిటీని గౌరవ అధ్యక్షుడు సిద్ధంశెట్టి లక్ష్మణ్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతుల కృష్ణమూర్తి ఆదివారం ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా మిరియాల రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా బచ్చు నాగరాజు, కోశాధికారిగా సోమ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా బచ్చు శ్రీనివాస్, కార్యదర్శులుగా కంభంపాటి వేణుమాధవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బచ్చు రాము, ప్రచార కార్యదర్శిగా బచ్చు రాజు, కార్యదర్శిగా ఆసు రాంబాబు, సహాయ కార్యదర్శిగా మంచికంటి శివకుమార్‌ను ఎన్నుకున్నారు.

నామినేషన్ క్లస్టర్‌ను పరిశీలించిన అబ్జర్వర్


చెల్పూరులో నామినేషన్ క్లస్టర్ పరిశీలిస్తున్న అబ్జర్వర్ ఫణీంద్రరెడ్డి

గణపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూరు నామినేషన్ క్లస్టర్‌ను రాష్ట్ర ఎన్నికల వ్యయ పరిశీలన అధికారి ఫణీంద్రరెడ్డి ఆదివారం సందర్శించారు. నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. మొత్తం ఎన్ని నామినేషన్లు దాఖలయ్యాయి.. ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా శనివారం నామినేషన్లు ముగియడంతో ఆదివారం మండలంలో ఏర్పాటు చేసిన క్లస్టర్లలో స్క్రూటీని అధికారులు నిర్వహించారు. ఎలాంటి సమస్యలు ఉత్పనం కాలేదని ఎంపీడీవో భాస్కర్ తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి

టేకుమట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏంపేడు గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో ఆదివారం చేరారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో మాజీ వార్డు సభ్యుడు చాటకొల్ల మల్లయ్య, కన్నూరి సతీష్, బెజ్జల గట్టయ్య, బెజ్జల చందు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ కోలిపాక రాజయ్య, పార్టీ గ్రామ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టెక్నికల్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

కాటారం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర టెక్నికల్ బోర్డ్ ద్వారా నిర్వహించే టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ (టీసీసీ) డ్రాయింగ్, టైలరింగ్ లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆర్ట్ ఇన్‌స్ట్రక్టర్ రజనీకాంత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏడో తరగతి, ఆపైన ఉత్తీర్ణులైన అభ్యర్థులు డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుకు డిసెంబరు 5 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. అపరాధ రుసుం రూ.50తో డిసెంబరు 12, రూ.75 తో డిసెంబరు 19వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. లోయర్ గ్రేడ్‌కు రూ.100, హయ్యర్ గ్రేడ్‌కు రూ.150 చలానాను ఎస్‌బీఐలో తీసి సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని వివరించారు. దరఖాస్తు హార్ట్ కాపీతోపాటు నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు, కులం, నివాసం, విద్యార్హత పత్రాలతో డీఈవో కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

కొత్త జీపీల్లో ఎన్నికల కళ

కృష్ణకాలనీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపా లపల్లి జిల్లాలో కొత్త పంచాయతీలకు కొంగొత్త కళ సంతరించుకుంటోంది. జిల్లాలో ఇది వరకు 241 గ్రామ పంచాయతీలు ఉండగా ఇటీవల అదనంగా కొత్తగా ఏడు ఏర్పాట య్యాయి. దీంతో తొలిసారిగా ఆయా గ్రామాల్లో ఎన్నికలు జరుగు తుండ టంతో కోలాహలం నెలకొంది. ఎక్కడా చూసినా ఈ గ్రామాల్లో రాజకీయ సందడే కనిపిస్తోంది. ఈ గ్రామాలతో పాటు మొత్తం 36 వార్డులు ఏర్పడటంతో ఎన్నికల సందడి జోరందుకుంది.


కొత్తగా ఏర్పడిన భూపాలపల్లి మండలంలోని గొర్లవీడుతండా గ్రామం వ్యూ

ఏడు గ్రామాల్లో ఒకటి ఏకగ్రీవం

జిల్లాలో కొత్తగా ఏడు గ్రామ పంచాయతీలు ఏర్పడగా ఇందులో ఒకటి ఏకగ్రీవమైంది. కొత్తగా ఏర్పడిన జీపీల జాబితాలో భూపాలపల్లి మండలంలోని గొర్లవీడుతండా, కొంపెల్లి తండా రెండు పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 8 వార్డు లు ఉన్నాయి. ఈ గ్రామాలకు రెండో విడతలో ఎన్నికలు జరగ నున్నాయి. అలాగే, చిట్యాల మండలంలోని రామచంద్రాపురం జీపీగా ఏర్పడగా ఇందేలో ఆరు వార్డులు ఉన్నాయి. ఈ గ్రామంలో సైతం రెండో విడతలో ఎన్నికలు జరగనున్నాయి. మొగుళ్లపల్లి మండలంలోని బద్దంపల్లి జీపీ ఏర్పడగా ఇందులో నాలుగు వార్డులు ఉన్నాయి. ఈ గ్రామానికి తొలి విడతలో ఎన్నికలు జరగన న్నాయి. కొత్తపల్లిగోరి మండలంలోని కొత్తపల్లి, బాలయ్యపల్లి రెండు జీపీలు ఏర్పడగా 12 వార్డు స్థానాలు ఉన్నాయి. ఈ రెండు గ్రామాల్లో బాలయ్యపల్లి జీపీ ఏకగ్రీవం కాగా మిగిలిన కొత్తపల్లి గ్రామానికి తొలి విడతలో ఎన్నికలు జరగనున్నాయి.టేకుమట్ల మండ లంలోని కలికో టపల్లి గ్రామం సైతం నూతన జీపీగా ఏర్పడగా ఈ జీపీ పరిధిలో ఆరు వార్డు స్థానాలు ఉన్నాయి. ఈ గ్రామానికి రెండో విడతలోనే ఎన్నికలు జరగనున్నాయి. మొత్తంగా కొత్తగా ఏర్పడిన గ్రామాల్లో ఎన్నికల వేళ రాజకీయ వాతావరణం నెలకొంది.

మేమూ పోటీ చేస్తాం: సీపీఐ

వాజేడు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని ధర్మవరంలో ఆ పార్టీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలని సీపీఐ కార్యవర్గం నిర్ణయం తీసుకుందని తెలిపారు. సీపీఎం, కాంగ్రెస్‌తో కలిసి పనిచేయటానికి అభ్యంతరాలు లేవని చెప్పారు. అలాగే కొన్ని జీపీలలో ఒంటరిగా పోటీ చేసే ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆచంట ప్రసాద్, మండల కార్యదర్శి నల్లెబోయిన రవీందర్, నాయకులు గార రాంబాబు, బొల్లె వెంకటేశ్వర్లు, గగ్గుల ప్రసాద్, కొప్పుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎలక్షన్లు ముగిసే దాకా నిరంతర నిఘా

(5వ పేజీ తరువాయి)

ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పె ట్టాం. తొలి విడత ఎన్నికల్లో 10 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాం. అత్యధికంగా ఓటర్లు కలిగిన గణపురం, చెల్పూరు లాంటి ప్రాంతాల్లో పోలీసుల నిఘా పెంచుతాం. పోలింగ్ మొదలుకొని ఫలితాల వెల్లడి అయ్యేంత వరకు ప్రత్యేక బందోబస్తు ఉంటుంది.

లైసెన్స్‌డ్ గన్నులు హ్యాండోవర్ చేసుకున్నాం..

జిల్లాలో లైసెన్స్ గన్నులు కలిగిన వ్యక్తులు పది ఉన్నారు. వారందరి నుంచి 10 గన్నులు తీసుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో డిపాజిట్ చే శాం. అలాగే, ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లపై నిఘా పెట్టాం. ఇప్పటికే చాలా పీఎస్‌ల పరిధిలోని రౌడీషీటర్లను బైండోవర్లు చేశాం. స్టేషన్ల వారీగా గతంలో నేర చరిత్ర కలిగిన వారి వివరాలు సేకరించాం. వారిపై ప్రత్యేక నిఘా ఉంటుంది. గొడవలకు తావించి శాంతి భద్రతలకు విఘా తం కలిగిస్తే సహించబోం. అలాగే గ్రామాల్లో గుడుంబా, లిక్కర్, బెల్టుషాపులు లేకుండా తనిఖీలు చేస్తున్నాం.

సోషల్ మీడియాపై నజర్

సోషల్ మీడియాపై సైతం పోలీసుల నిఘా ఉటుంది. ఒకరిపై ఒకరు రెచ్చగొట్టే వ్యాఖ్యలు వంటివి చేస్తే మానిటరింగ్ టీమ్ గుర్తించే వీలు ఉంది. అందుకు తగ్గట్టు కార్యచరణ రూపొందించాం.

ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత గెలి చిన వారు గానీ, ఓడిన వారు గానీ ఉద్దేశ పూర్వ కంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎంతటి వారిపైనైనా సోషల్ మీడియా యాక్టు కింద కేసులు నమోదు చేస్తాం.

బీఆర్‌ఎస్‌ను గెలిపించుకోవాలి : గోవింద్‌నాయక్


బీఆర్‌ఎస్ శ్రేణులతో ఆ పార్టీ జిల్లా నాయకుడు గోవింద్ నాయక్

వెంకటాపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మద్దతు ఇచ్చే అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆ పార్టీ సీనియర్ జిల్లా నాయకుడు పోరిక గోవింద్ నాయక్ అన్నారు. మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామంలో ఆయన ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌గా పోటీ చేస్తున్న బీరెల్లి స్వప్నను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మాజీ వార్డు సభ్యుడు, గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు పెరుమాండ్ల పున్నం తిరిగి బీఆర్‌ఎస్‌లోకి చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రబెల్లి గోపాల్‌రావు, మాజీ సర్పంచ్ గట్టు కుమారస్వామి, నాయకులు తండ రమేష్, నడిగొట్టు సుదర్శన్, అజ్మీరా హరీశ్, అంతటి రాము, ముడిగె రాజ్‌కుమార్, మూడ్ తిరుపతి, గుండె యాదగిరి, అంతగిరి రాజు, చంద్రగిరి రాజయ్య, చిలుక కుమార్, నూనేటి సమ్మయ్య, వీరగాని రమేష్, ఏదుల రజనీకాంత్, జేరిపోతుల కిరణ్, కొండ రాజు, సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రైవేటు టీచర్లుగా ముగ్గురు


ప్రశంసా పత్రాలు అందుకున్న ప్రైవేట్ ఉపాధ్యాయులు

ములుగు టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ప్రైవేటు టీచర్లుగా జిల్లాకు చెందిన ఎం.డి.చాంద్‌పాషా, జక్కుల వేణు, సుంకరి జగదీశ్, విజయ్, శ్యామ్ ఎంపికయ్యారు. తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ప్లాజాలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు వీరికి ప్రశంసా ప్రతాలు అందజేశారు. టీపీటీఎఫ్ స్టేట్ ప్రెసిడెంట్ షబ్బీర్, ప్రైవేట్ విద్యాసంస్థల ఛైర్మన్ సుందర్ రాజు యాదవ్, ఉమ్మడి వరంగల్ జిల్లా టీపీటీఎఫ్ ప్రెసిడెంట్ సునీల్, ప్రైవేట్ స్కూల్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎర్రమ్మ దేవాలయ వార్షికోత్సవం

ఏటూరునాగారం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వై-జంక్షన్ వద్ద ఉన్న ఎర్రమ్మ దేవాలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొద్ది రోజులుగా మండలంలో రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్న నేపథ్యంలో, ప్రజలు ప్రత్యేకంగా అమ్మవారిని వేడుకున్నారు. రోడ్డు ప్రమాదాలు పూర్తిగా తగ్గిపోవాలని కోరుకుంటూ ఎర్రమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల సీనియర్ నాయకులు కాకులమర్రి ప్రదీప్ బాబు, తాడూరి రఘు, తుమ్మ మల్లారెడ్డి, జాడి బోజరావు, కూనూరు అశోక్, మాదరి రామయ్య, మెరుగు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

ఏటూరునాగారం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన దివంగత కాంగ్రెస్ కార్యకర్త జాడి సమ్మయ్య కుటుంబ సభ్యులను, శంకరాజుపల్లి గ్రామానికి చెందిన దివంగత జాడి సమ్మక్క కుటుంబాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు తదితరులు ఆదివారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం సర్పంచ్ అభ్యర్థి గుడ్ల శ్రీలత, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్‌తో పాటు, మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇంటి పన్నుల వసూలు

చిట్యాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఇంటిపన్నుల వసూళ్లు జోరందుకున్నాయి. ఆదివారం మండల వ్యాప్తంగా నామినేషన్లు ప్రారంభం కావడంతో ఆయా గ్రామాల్లో జీపీ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఇంటి పన్నుల వసూళ్లకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. సర్పంచ్, వార్డు సభ్యుల పోటీదారులతో పాటు వారికి మద్దతు తెలిపే వారు, బలపర్చే వారు నో డ్యూ సర్టిఫికెట్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేయాల్సి ఉం టుంది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు ఇంటిపన్నులు చెల్లించి రశీదు తీసు కున్నారు. స్థానిక ఎన్నికలు కావడంతో అభ్యర్థులే ఆయా గ్రామాల్లో అందరి ఇంటిపన్నుల ఖర్చు భరిస్తున్నారని తెలిసింది.


చిట్యాల జీపీ కార్యాలయం వద్ద ఇంటి పన్ను కౌంటర్

రిటైరైన ప్రిన్సిపాల్‌కు ఆత్మీయ సన్మానం

కాటారం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకులం ప్రిన్సిపాల్ హట్కర్ రాజేందర్ రిటైర్ కాగా ఆయనకు ఆత్మీయ సన్మానం ఆదివారం జరిగింది. అధ్యాపకులు, ఉపాధ్యాయులు, గురుకుల సిబ్బంది ప్రిన్సిపాల్ దంపతులను పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ మాధవి, వెంకటయ్య, వార్డెన్ బలరాం, వ్యాయామ ఉపాధ్యాయులు, గురుకుల సిబ్బంది తదితరులు ఉన్నారు.

పొలాల్లోకి కాల్వ నీరు.. రైతన్నల బేజారు


పంట పొలాల్లోకి చేరుతున్న నీరు

మల్హర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎడ్లపల్లి అటవీ ప్రాంతంలోని బొగ్గులవాగు ప్రాజెక్టు డీ1 కాల్వ నీరు పొలా ల్లోకి చేరింది. దీంతో ఎడ్లపల్లి శివారు ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి ఉందని అంటు న్నారు. పంట కోతకు వచ్చిన సమయంలో కాల్వ ద్వారా నీరు పొలాల్లోకి చేరడం వల్ల కోయలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొయ్యూర్ నుంచి ఎడ్లపల్లి శివారు వరకు ఉన్న పంట పొలాల్లో ఇదే పరిస్థితి ఉందని అంటున్నారు. కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపి వేయాలని కోరుతు న్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ అధికా రులను వివరణ కోరగా ప్రాజెక్టులో నీటి నిల్వ గతంలో కంటే చాలా ఎక్కువగా ఉండటం వల్ల లీకేజీతో పొలాల్లోకి చేరుతోందన్నారు.

దత్తాత్రేయ స్వామి ఆలయంలో అరుణహోమం


అరుణ హోమంలో శ్రీనుబాబు దంపతులు, వేదపండితులు

కాటారం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):మండలంలోని ధన్వాడలో శ్రీదత్తాత్రేయస్వామి ఆలయంలో దత్త నవరాత్రోత్సవ వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. ఐదో రోజైన ఆదివారం ఆలయంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు-నితిక దంపతుల చేతులమీదుగా అరుణహోమం నిర్వహించారు. వేదపండితులు కృష్ణమోహన్, ప్రవీణ్, గణేష్, నగేష్, సుమిత్‌పాండే, శ్యాం తదితరులు హోమం నిర్వహించగా పలువురు భక్తులు మొక్కుకున్నారు. హోమం సందర్భంగా వేదమంత్రోచ్చరణలతో అలరించిన మంథనికి చెందిన వేద పాఠశాల విద్యార్థులను శ్రీనుబాబు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తల్లి జయశ్రీ, పలు ప్రాంతాలకు చెందిన భక్తులు, గ్రామపెద్దలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...
దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !
పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.
సంప్రదించగలరు : జయశంకర్
Jayashankar Aco - 9985426984,
Bhupalpally SR - 8008795764
Mulugu SR - 9849245045, Eturunagaram
SR - 7673960447 ACM - 9985411664